సాక్షి మంచిర్యాల

మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



గురుకులం పిలుస్తోంది..

2024-25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశానికి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి నోటిఫికేషన్ విడుదల చేశారు. 8లో▸



అర్హులకు సంక్షేమ పథకాలు

కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.4 /15.2

వాతావరణం

ఆకాశం దాదాపు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. తుపాను ప్రభావంతో చలి తీవ్రత పెరుగుతుంది. చల్లగాలులు వీస్తాయి.

లోక్‌సభపై హస్తం గురి

- రెండు నియోజకవర్గాలకు ఇన్‌చార్జీల నియామకం
- మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కకు బాధ్యతలు
- ఆదిలాబాద్‌లో ఆమెకు సవాలే
- పెద్దపల్లిలో 'దుద్దిళ్ల'కు సులువేనా..



సాక్షి, ఆదిలాబాద్: వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ గురి పెట్టింది. జనవరిలో అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ పరిధిలో పార్టీని పటిష్టం చేయడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను నియమించింది. ఆదిలాబాద్‌కు రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను, పెద్దపల్లికి ఐటీ, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును నియమించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగింటిలో బీజేపీ గెలిచింది. రెండుచోట్ల బీఆర్‌ఎస్, ఒకచోట కాంగ్రెస్ విజయం సాధించాయి. ఇక పెద్దపల్లి లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా అన్నీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని గెలిపించడం శ్రీధర్‌బాబుకు పెద్దకష్టం కాదని ప్రచారం సాగుతోంది.

సీతక్కకు సవాలే..

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జీగా నియమితులైన సీతక్కకు ఇక్కడ సవాళ్లు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ విజయఢంకా మోగించింది. ఎంపీగా సోయం బాపూరావు విజయం సాధించారు. గడిచిన శాసన సభ ఎన్నికల్లో ఈ లోక్‌సభ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు కమలం ఖాతాలో చేరాయి. బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ తమ ప్రాబల్యం నిలుపుకుంది. కేవలం ఖానాపూర్ నియోజకవర్గంలో మాత్రమే కాంగ్రెస్ గెలిచింది. ఇదిలా ఉంటే గతంలో సీతక్క ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పలుమార్లు పర్యటించారు. నాయకులు, పార్టీ స్థితిగతులపై అవగాహన ఉంది. అయితే ప్రతికూల పరిస్థితుల నుంచి విజయాన్ని అందుకోవాల్సిన పరిస్థితుల నేపథ్యంలో లోక్‌సభ సీటును గెలిపించడం సీతక్కకు సవాలే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఈ బాధ్యత ఇన్‌చార్జీలదే..

ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు బాధ్యతలను కూడా ఇన్‌చార్జీలే తీసుకోనున్నారు. అయితే ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఆరు చోట్ల ఎమ్మెల్యేలు లేకపోవడంతో అక్కడ ఆ పథకాల అమలు పరంగా ఆ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన వారిని పరిగణలోకి తీసుకుని ముందుకెళ్తారా.. లేక ఇతర ముఖ్య నాయకులకు ప్రాధాన్యతనిస్తారనేది చూడాలి. ఇక పెద్దపల్లిలో అందరూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంతో సంక్షేమ పథకాల అమలులో ఆ పార్టీకి పెద్దగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం లేదు. డిసెంబర్ 28 నుంచి గ్రామసభలు నిర్వహించి పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక చేయనున్నారు. ఈ క్రమంలో ఇన్‌చార్జీలు కీలకం కానున్నారు.

శ్రీధర్‌బాబుకు సులువేనా..

ఇక పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జీగా నియమితులైన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇదే నియోజకవర్గ పరిధిలోని మంథని శాసనసభ్యుడు. గతంలో కాంగ్రెస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. స్థానిక నేతలపై పట్టు ఉంది. అయితే గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడ బీఆర్‌ఎస్ హవాతో అభ్యర్థి బొర్లకుంట వెంకటేశ్‌నేత ఎంపీగా గెలిచారు. ఇక ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది. చెన్నూర్, మంచిర్యాల, మంథని, రామగుండం, పెద్దపల్లి, ధర్మపురిలో హస్తం పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ఇక ఆరు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ రెండో స్థానంలో, మంచిర్యాల నియోజకవర్గంలో మూడో స్థానంలో నిలవడం గమనార్హం. దీంతో రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ ఉత్సాహం చూపుతుండగా, బీఆర్‌ఎస్ 2019 ఫలితాలను పునరావృతం చేయాలని చూస్తోంది. అయితే ఇక్కడ పార్టీని గెలిపించడం శ్రీధర్‌బాబుకు సులువే అన్న చర్చ సాగుతోంది.

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణతో జీవకోటి మనుగడ

- కలెక్టర్ బి.సంతోష్



బట్ట సంచులు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: పర్యావరణ పరిరక్షణ, కాలుష్యం నియంత్రణతోనే జీవకోటి మనుగడ సాధ్యమవుతుందని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో పర్యావరణ అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు చెందిన రాష్ట్ర నేషనల్ కోర్‌లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ సందేశంతో రూపొందించిన బట్ట సంచులను సోమవారం ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ పర్యావరణ మిత్ర సంచులనే వాడాలని సూచించారు. జీవకోటి మనుగడకు పెను ముప్పుగా పరిణమిస్తున్న ప్లాస్టిక్ వినియోగించొద్దని సూచించారు. త్వరలో జిల్లాలో ఎంపిక చేసిన అన్ని యాజమాన్యాల గ్రీన్ కోర్ పర్యావరణ క్లబ్బులు గల ఉన్నత పాఠశాలలకు బట్ట సంచులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో ఎస్.యాదయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, సైన్స్ అధికారులు మధుబాబు, యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జామ్ సెంటర్ కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

జన్నారం: డిగ్రీ ఫైనల్ పరీక్షలకు ఎగ్జామ్ సెంటర్‌ను లక్సెట్టిపేటకు తరలించడంపై జన్నారం మండల కేంద్రంలో విద్యార్థులు రోడ్డెక్కారు. ఏఆర్‌ఎస్ కళాశాల విద్యార్థులు టీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై సోమవారం రాస్తారోకో చేశారు. వీరికి ఏబీవీపీ నాయకులు మద్దతు తెలిపారు. తెలంగాణ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ జన్నారంలో ఉన్న డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని లక్సెట్టిపేటకు తరలించడం సరికాదన్నారు. సెంటర్ తరలింపుతో 40 కిలోమీటర్ల దూరం వెళ్లి పరీక్ష రాయడానికి విద్యార్థులు ఇబ్బంది పడతారని పేర్కొన్నారు. డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని జన్నారంలో కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ అధ్యక్షుడు మనీష్‌కుమార్, టీఎస్‌యూ మండల అధ్యక్షుడు జీయాయొద్దీన్, మండల నాయకులు రాకేశ్, ప్రశాంత్, సాగర్ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

పాతమంచిర్యాల: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జైపూర్ సాంఘిక సంక్షేమ పాఠశాలలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాంబమూర్తి, మారయ్య తెలిపారు. 14 నుంచి 16 ఏళ్ల వారికి నిర్వహించే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఫిబ్రవరిలో జరిగే జాతీయ పోటీలకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 20న ఉదయం 7.30 గంటలకు జైపూర్ పాఠశాలకు రావాలని సూచించారు.

గుర్తింపు ఎన్నికలపై కొనసాగుతున్న ఉత్కంఠ

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టులో ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ నెల 27న ఎన్నికలు జరగాల్సి ఉంది. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు డెప్యూటీ సీఎల్సీ ఎన్నికల ప్రక్రియ కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ ఇంధనశాఖ సెక్రెటరీ ఈ ఎన్నికలను 2024, మార్చికి వాయిదా వేయాలని హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలుచేశారు. ఈ కేసు సోమవారం బెంచ్‌పైకి వచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వం ఎన్నికల వాయిదా కోరగా.. 27న ఎన్నికలు నిర్వహించడానికి అందరూ అంగీకరించారని, ఇప్పుడు అభ్యంతరం ఏమిటని న్యాయమూర్తి ప్రశ్నించారు. దీనిపై ఏమైనా చెప్పాలనుకుంటే ఈనెల 21న రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని కోర్టు సూచించినట్లు ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య తెలిపారు.

మెడికోలను బలిగొన్న అతివేగం!



అతివేగం.. అజాగ్రత్త రెండు నిండు ప్రాణాలను బలిగొంది. వైద్యవిద్యను అభ్యసించి రోగులకు సేవలందించాల్సిన వారు ఊహించని రీతిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యు ఒడిని చేరారు. 10లో▸

సమస్యలు సత్వరం పరిష్కరించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

నస్పూర్: వివిధ సమస్యలపై ప్రజావాణికి వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రాహుల్, డీఆర్డీవో శేషాద్రితో కలిసి దరఖాస్తులు స్వీకరించారు.

- మహాలక్ష్మి పథకం కారణంగా తమకు ఉపాధి లేకుండా పోయింది, ప్రత్యామ్నాయ ఉపాధి, జీవన భృతి, బీమా కల్పించాలని లైట్‌మోటార్ టాక్సీ వెహికిల్ ఫిట్‌నెస్ చార్జీలు రద్దు చేయాలని జీప్స్, టాటా మ్యాజిక్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు దరఖాస్తు సమర్పించారు.
- మంచిర్యాల జిల్లా కళాకారులు, సాహితీవేత్తలు, నృత్య కళాకారులు, జానపద కళాకారులకు ఒక కళావేదిక నిర్మాణానికి సహకరించాలని యువ కళాసమితి సాహితి సాంస్కృతిక సంస్థ ప్రతినిధులు అర్జీ పెట్టుకున్నారు.
- లక్సెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన నల్మాస్ లక్ష్మీనారాయణ తనకు గ్రామ శివారు భూమి ఉందని, పట్టాపాస్ బుక్ వివరాలు సవరణ కోసం చేసుకున్న దరఖాస్తును పరిశీలించాలని విన్నవించాడు.

పెండింగ్ దరఖాస్తులు..

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ శాఖలలో ఇప్పటి వరకు పెండింగ్ ఉన్న దరఖాస్తులను కూడా వచ్చే ప్రజావాణి నాటికి పరిష్కరించాలని ఆదేశించారు. డీఈవో కార్యాలయంలో 9, ఆర్‌అండ్‌బీ శాఖ వద్ద 15, ట్రైబల్ వెల్ఫేర్ వద్ద 9, ఇరిగేషన్ శాఖ వద్ద 5, మిషన్ భగీరథ వద్ద 9, మైనార్టీ వెల్ఫేర్ వద్ద 3, పంచాయతీ అధికారి వద్ద 6, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ వద్ద 5, సివిల్ సప్లయ్ వద్ద 14, యానిమల్ హస్బెండరీ వద్ద రెండు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. మున్సిపల్, రెవెన్యూ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సైతం వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

పెన్షన్ పునరుద్ధరించాలి..



నాకొడుకు దేవరాల రాజేశ్ (17), కూతురు దేవరాల లక్ష్మి(13) ఇద్దరూ మానసిక దివ్యాంగులు, వయసుకు తగినట్లుగా శారీరకంగా, మానసికంగా ఎదగలేదు. వారికి 2018 నుంచి దివ్యాంగుల పెన్షన్ వచ్చింది. రెండేళ్లుగా పెన్షన్ నిలిపివేశారు. పెన్షన్ పునరుద్ధరించండి.

– పుష్పలత, గుడిపేట

పెన్షన్ ఇప్పించండి..



నేను దివ్యాంగురాలిని నాకు 2013 వరకు దివ్యాంగుల పెన్షన్ వచ్చింది. తర్వాత నిలిపివేశారు. నాకు దివ్యాంగుల పెన్షన్ ఇప్పించండి.

– వేముర్ల కళ్యాణి, సీసీసీ నస్పూర్

పరిహారం ఇప్పించండి..



మేము కాసిపేట మండలం లంబడి తండా(కే), సోమగూడెం(కే), దుబ్బ గూడెం ప్రాంత వాసులము.మా భూములు కేకే–2 ఓసీపీలో ముంపునకు గురి అయ్యాయి.సింగరేణి యాజమాన్యం గుర్తించక మా భూములు మిస్సింగ్‌లో ఉన్నాయి. నోటిఫికేషన్, అవార్డు పరిహారం ఇప్పించండి.

– బాదావత్ కృష్ణ, లకావత్ సరిత, సాహితి, అజ్మీరా సురేష్, బలరాం, తిరుపతి, రవి, కుర్సింగ్ పతంబాయి

నస్పూర్ మున్సిపాలిటీ 'హస్త'గతం!?

- చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించిన కౌన్సిలర్లు
- కలెక్టర్‌కు నోటీసు అందజేత

నస్పూర్: జిల్లాలో మరో మున్సిపాలిటీ 'హస్త'గతం కావడం దాదాపు ఖాయమైంది. ఇప్పటికే మంచిర్యాల, బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్లపై సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. తాజాగా ఆ జాబితాలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ చేరారు. అవిశ్వాసాన్ని ప్రతిపాదిస్తూ 18 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన నోటీసును కలెక్టర్ బదావత్ సంతోష్‌కు సోమవారం అందజేశారు. కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు నేతృత్వంలో పలువురు కౌన్సిలర్లు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం సురిమిల్ల వేణు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అవినీతి పాలనను నిరసిస్తూ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్లు బొడ్డున సంధ్యారాణి, గెల్లు రజిత, బండారి సంధ్యారాణి, తెనుగు లావణ్య, శీపతి సుమతి పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు..

అంతకుముందు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఇంట్లో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌కు చెందిన 1వ వార్డు కౌన్సిలర్ బండి పద్మ, 3వ వార్డు కౌన్సిలర్ బెడిక లక్ష్మి, 5వ వార్డు కౌన్సిలర్ బొౌతు లక్ష్మి, 7వ వార్డు కౌన్సిలర్ చిదం మహేశ్, 6వ వార్డు కౌన్సిలర్ పూదరి కుమార్, 14 వ వార్డు కౌన్సిలర్ కెడిక ప్రకాశ్‌రెడ్డి, 24 వ వార్డు కౌన్సిలర్ మర్రి రాజమౌళి, కోఆప్షన్ మెంబర్ ఎండీ నాజర్ కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



కలెక్టర్‌కు నోటీసు అందజేస్తున్న కౌన్సిలర్లు

చైర్మన్ పీఠం కాంగ్రెస్‌దే..

నస్పూర్ మున్సిపాలిటీలో మొత్తం 25 స్థానాలు ఉండగా, 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్10, కాంగ్రెస్ 6, బీజేపీ 3, సీపీఐ 2 ఇండిపెండెంట్లు 3, ఏఐఎఫ్‌బీ 1 స్థానం గెలిచాయి. ఇండిపెండెంట్లు, సీపీఐ 2, ఏఐఎఫ్‌బీ కౌన్సిలర్లు తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్‌ఎస్ నేత ఈసంపల్లి ప్రభాకర్ మున్సిపల్ చైర్మన్‌గా, ఇండిపెండెంట్ అభ్యర్థి తోట శ్రీనివాస్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. తర్వా త బీఆర్‌ఎస్ కౌన్సిలర్ బండారి సంధ్యారాణి కాంగ్రెస్‌లో చేరగా, బీజేపీ నుంచి గెలిచిన కోడూరి లహరి, బేర సత్యనారాయణ, కాంగ్రెస్ నుంచి గెలిచిన కెడిక ప్రకాశ్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్‌ఎస్ బలం 16కు చేరింది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. దీంతో బీఆర్‌ఎస్ బలం 8కి పడిపోయింది. కాంగ్రెస్ బలం 15కు పెరిగింది. బీ జేపీ అభ్యర్థి, ఇద్దరు సీపీఐ సభ్యుల కూడా కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చారు. దీంతో కాంగ్రెస్ బలం 18కి చే రింది. ఈ నేపథ్యంలో చైర్మన్ పీఠం హస్తగతం కావడం ఖాయమైంది.

మళ్లీ సర్దుబాటు!

- జిల్లా పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- తాజాగా ఆరుగురిని వర్క్ అడ్జస్ట్ చేసిన అధికారులు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి ఎక్కువ ఉపాధ్యాయులున్న పాఠశాలల నుంచి వర్క్ అడ్జస్ట్ పేరిట టీచర్లను సర్దుబాటు చేస్తోంది. ఈ విద్యాసంవత్సరం ఇప్పటికే 136 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేయగా తాజాగా మరోసారి వర్క్ అడ్జస్ట్ చేసింది. పదో తరగతి విద్యార్థులకు ఆటంకం లేకుండా సర్దుబాటు చేశారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో 9441 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. 4,831 బాలురు, 4,610 బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. గతేడాది పది ఫలితాల్లో రాష్ట్రంలో 27 స్థానంతో వెనకబడి పోయింది. ఈఏడాది మెరుగైన ఫలితాలకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ తరుణంలో మరోసారి ఆరుగురు టీచర్లను విద్యాశాఖ సర్దుబాటు చేసింది. మిగిలిన ఖాళీలను భర్తీ చేయకుంటే విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

బోధనపై ప్రభావం..

పదో తరగతి విద్యార్థులకు సంబంధించి పాఠ్యప్రణాళిక ఇప్పటి వరకు పూర్తికాలేదు. సెప్టెంబర్‌లో ఉపాధ్యాయ, పదోన్నతులు, బదిలీల ప్రక్రియ నిర్దేశించిన పాఠ్యప్రణాళికకు అవరోధంగా మారింది. అక్టోబర్, నవంబర్‌లో ఎన్నికలు అడ్డంకిగా మారాయి.. ఉపాధ్యాయులు శిక్షణ నుంచి ఎన్నికల నిర్వహణకు వెళ్లడంతో పాఠ్యాంశాలు ముందుకుసాగలేదు. అక్టోబర్‌లో దసరా సెలవులు ప్రకటించగా బోధనపై ప్రభావం చూపింది. అక్టోబర్ 5 నుంచి 11 వరకు సమ్మేటివ్ పరీక్షలు రావడంతో పాఠ్యప్రణాళిక పూర్తిచేయడంలో వెనుకబడిపోయారు. దీంతో నవంబర్ 6 నుంచి డిసెంబర్ 30 వరకు 41 రోజుల ప్రత్యేక టైంటేబుల్‌ను విద్యాశాఖ విడుదల చేసింది. ప్రస్తుతం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. జనవరి నుంచి మరో గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.



జైపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రత్యేక క్లాస్‌లో చదువుతున్న విద్యార్థులు

టీచర్ల కొరతతో..

జిల్లాలో సబ్జెక్టు టీచర్ల కొరత ఒకవైపు.. మరోవైపు పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో అధికారులకు సర్దుబాటు తప్ప వేరే మార్గం లేకుండాపోయింది. అయితే పదుల సంఖ్యలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నా కేవలం ఆరుగురిని సర్దుబాటు చేశారు. లింగాపూర్ ఎంపీయూపీఎస్ నుంచి ఎస్ఏ సోషల్ టీచర్‌ను జెడ్పీహెచ్ఎస్ దండేపల్లికి డిప్యూటేషన్ ఇచ్చారు. ఎంపీయూపీఎస్ లక్ష్మీకాంతపూర్ ఎల్‌పీ తెలుగు టీచర్‌ను జెడ్పీహెచ్‌ఎస్ కోర్మిచెల్మ, అదే పాఠశాలకు చెందిన ఎల్‌పీ హిందీ టీచర్‌ను జెడ్పీహెచ్‌ఎస్ రెబ్బనపల్లికి, జెడ్పీహెచ్‌ఎస్ దండేపల్లికి చెందిన ఎస్‌ఏ బయోసైన్స్ టీచర్‌ను జెడ్పీహెచ్‌ఎస్ గూడెం, జెడ్పీహెచ్‌ఎస్(బాలికల) లక్సెట్టిపేట్ గణితం ఉపాధ్యాయుడిని జెడ్పీహెచ్‌ఎస్ జెండా వెంకటపూర్‌కు సర్దుబాటు చేశారు.

ఖాళీలు ఇలా..

ఎస్ఏలు బదిలీలు అయినా రిలీవ్ కాకపోవటం.. పీజీహెచ్‌ఎంలుగా పదోన్నతులు పొంది వెళ్లిపోయిన స్థానంలో ఖాళీలు మిగిలిపోయాయి. ఇలా వివిధ కారణాలతో సబ్జెక్టు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి. కన్నెపల్లి బొగూడగూడెంలో ఇంగ్లిష్ టీచర్ ఆసిఫాబాద్ కుమురంభీం జిల్లాకు వెళ్లిపోయాడు. బెల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ ఉపాధ్యాయుడు పీజీ హెచ్‌ఎంగా ప్రమోషన్‌పై వెళ్లగా అక్కడ ఖాళీగానే ఉంది. నెన్నెల్ మండలం గుండ్లసోమారం స్కూల్‌లో సబ్జెక్టు టీచర్ కొరత ఉంది. నక్కపల్లి గణితం టీచర్ ప్రమోషన్‌పై ఆకెనపల్లి బదిలీకాగా ఇంకా ఎవరినీ సర్దుబాటు చేయలేదు. మారుమూల ప్రాంతం కావటంతో ఎవరూ ముందుకు రావడంలేదని సమాచారం. ముల్కల్ల జెడ్పీ హైస్కూల్‌లో బయోసైన్స్ టీచర్ పదోన్నతిపై వెళ్లారు. ధర్మారావుపేట్ పాఠశాల నుంచి ఎస్ఏ బయోసైన్స్ టీచర్ ఇక్కడకు బదిలీ అయినా రిలీవ్ చేయక అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. అదే టీచర్‌ను తాత్కాలి క సర్దుబాటు చేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో బయోసైన్స్, సోషల్, హిందీ టీచర్ల కొరత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

'పది'లో లెక్క తప్పకుండా..

గతేడాది పదో తరగతి ఫలితాలు నిరాశపర్చాయి. కరోనా ప్రభావంతో పై తరగతులకు ప్రమోట్ చేసిన విద్యార్థుల్లో పదోతరగతి బ్యాచ్ ఒకటి. ఆన్‌లైన్ పాఠాలు అర్థం కాక విద్యార్థులు చదువులో వెనుకబడినట్లు తెలుస్తోంది. గతేడాది ఫలితాల్లో గణితం తర్వాత సైన్స్ విద్యార్థులే ఎక్కువగా ఫెయిల్ అయ్యారు. లెక్కల్లో తికమకపడి 1,162 మంది విద్యార్థులు ఫెయిల్ కాగా, 663 మంది సైన్స్, 396 ఇంగ్లిష్, 207 తెలుగు, 156 మంది సోషల్, 68 మంది హిందీ పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. ఈనేపథ్యంలో ఈసారి పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఉత్తమ ఫలితాల కోసం..

పదో తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం రాష్ట్ర విద్యాశాఖ లక్ష్య కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. అందుకు అనుగుణంగా జిల్లాలో కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. కొన్నిచోట్ల ఉపాధ్యాయుల కొరత ఉన్న నేపథ్యంలో టీచర్లను సర్దుబాటు చేశాం. పాఠశాలలో ప్రత్యేక తరగతుల నిర్వహణకు హెచ్ఎంలను ఆదేశించాం. పాఠ్యాంశాల బోధన వేగవంతం చేసేలా చర్యలు చేపడుతాం.

– యాదయ్య, డీఈవో

ఉచిత ప్రయాణ విధానం సవరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణం విధానాలలో మార్పులు తీసుకురావాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ నాయకులు జంగంపెల్లి రామస్వామి, నందిపాటి రాజు అన్నారు. కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఆర్టీసీ బస్సుల్లో తెల్ల రేషన్ కార్డులు కలిగిన మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని ఉద్యోగస్తులైన మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం, భూ స్వాములకు రైతుబంధు లబ్ధి కల్పించినట్లే అవుతుందన్నారు. ఉచిత ప్రయాణం ఆటోలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఆటో కార్మికులకు జీవన భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు మేడి రాజు, కల్లూరి క్రాంతికుమార్, సిద్ధూ, ఖాదర్, కళావతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు

ఆసిఫాబాద్అర్బన్: బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.వి. రమేష్ తీర్పునిచ్చారు. డిస్ట్రిక్ లైసెనింగ్ అధికారి కె.సాగర్, ఎస్సై సీఎంఎస్ ఆసిఫాబాద్, సబ్ డివిజనల్ అధికారి రాంసింగ్ వివరాల ప్రకారం... ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండి గ్రామంలో జరిగిన అత్యాచారం ఘటనలో ఆసిఫాబాద్‌కు చెందిన వసంత్ (19)పై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. పోలీసుల విచారణ అనంతరం చార్జిషీట్ దాఖలు చేసి, ఫోక్సో కేసులో పోలీసులు సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసాద్ ప్రవేశపెట్టిన సాక్షుల విచారణ అనంతరం కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం నిందితుడికి 420, 376(2)(3)ఐపీసీ, ఫోక్సో చట్టం కింద సెక్షన్ 4 కింద 20ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.30వేల జరిమానా విధించారు.

ఒకరి అదృశ్యం

జన్నారం: మండలం లోత్రై గ్రామానికి చెందిన కుడిమెత జైవంతరావు అదృశ్యమైనట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. అక్టోబర్ 5న ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఎన్ని రోజులైనా రాకపోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్: 87126 56547కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గోలేటిలో సినీ నటుడు నాజర్ సందడి



నాజర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రెబ్బెన(ఆసిఫాబాద్): షాట్ ఫిల్మ్ షూటింగ్‌లో భాగంగా ప్రముఖ సినీ నటుడు నాజర్ సోమవారం గోలేటిలో సందడి చేశారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో షాట్‌ఫిల్మ్‌ను చిత్రీకరించారు. దానిలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను సింగరేణి ఉన్నత పాఠశాల సిబ్బంది, ఏఎంసీ మాజీ చైర్మన్ పర్లపల్లి వనజ దంపతులు నాజర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీఈటీ భాస్కర్, పీఆర్‌వో కుందారపు నరేష్ ఉన్నారు.

గురుకులం పిలుస్తోంది..

- ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ
- ప్రారంభమైన ఆన్‌లైన్ ప్రక్రియ
- ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక
- ఎస్సీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ప్రవేశం



బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశానికి (వీటీజీ సెట్ -24) రంగం సిద్ధమైంది. ఈ మేరకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) కార్యదర్శి, చీఫ్ కన్వీనర్ ఇ.నవీన్ నికోలస్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలలను ఆయా సంక్షేమ శాఖల ద్వారా గురుకులాలను నిర్వహిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమం ద్వారా బోధన చేస్తూ విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సహజసిద్ధమైన నైపుణ్యాలను వెలికితీయడానికి గురుకుల విద్యాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. దీంతో ఆయా గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఏటా విద్యార్థుల మధ్య తీవ్రమైన పోటీ ఉంటోంది. ప్రవేశపరీక్షలో మెరిట్ మార్కుల ప్రాతిపదికన ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి సీటు కేటాయిస్తారు. ప్రభుత్వ గురుకులాల్లో సీటు సాధించిన విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు.

దరఖాస్తుదారులకు సూచనలు :
- 2023-24 విద్యాసంవత్సరంలో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
- ప్రస్తుత విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదువుతున్నట్లుగా సంబంధిత పాఠశాల నుంచి బోనఫైడ్ /స్టడీ సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో పాటు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.
- ఓ అభ్యర్థికి బదులు మరో అభ్యర్థి ఫొటో పెట్టి దరఖాస్తు చేయరాదు. ఎవరైనా ఆ తీరుగా వ్యవహరిస్తే క్రిమినల్ చర్యలకు బాధ్యులవుతారు.
- విద్యార్థుల ఎంపికకు ఉమ్మడి జిల్లా యూనిట్‌గా పరిగణిస్తారు.
- ఇతర సమాచారం కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 1800 42545678ను ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించవచ్చు.

జనవరి 6 వరకు గడువు..
ఐదో తరగతిలో ప్రవేశం కోసం 2024 ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ఎంపిక చేసిన కేంద్రాలలో ఉదయం 11గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 1గంటకు ముగుస్తుంది. ప్రవేశ పరీక్ష రాయడానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 18న ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ 2024 జనవరి 6వ తేదీ వరకు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఇందుకు రుసుము రూ.100 ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఫోన్ నెంబర్‌తో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో ఉన్న గురుకులాల వివరాలు

జిల్లా	గురుకుల సొసైటీ	గురుకులాలు
మంచిర్యాల	టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	09
మంచిర్యాల	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	08
మంచిర్యాల	టీఆర్‌ఈఐఎస్	01
కొమురంభీమ్	టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	10
కొమురంభీమ్	టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	05
కొమురంభీమ్	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	05
ఆదిలాబాద్	టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	03
ఆదిలాబాద్	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	06
ఆదిలాబాద్	టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	13
నిర్మల్	మొత్తం గురుకులాలు	19

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వ గురుకులాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. ప్రైవేట్ విద్యా సంస్థలకు ఏమాత్రం తీసిపోకుండా అన్ని ప్రమాణాలతో బోధన చేసి విద్యార్థులను అన్ని విధాలా తీర్చిదిద్దడానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది. ప్రత్యేకించి విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆటలపై ఆసక్తి, ధ్యానం ఇతర అన్ని విధాల విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ప్రోత్సాహకాన్ని అందిస్తున్నాం. ప్రభుత్వ గురుకులాల్లో సీటు రావడం వరంగా విద్యార్థులు గుర్తించాలి.

– ఐనాల సైదులు, ప్రిన్సిపాల్, సంక్షేమ గురుకుల విద్యాలయం, బెల్లంపల్లి

జాతీయ క్రీడాకారుడిని ఆదుకోండి

- ఈనెల 29న అండమాన్ నికోబార్‌లో పోటీలు
- జాతీయ క్రీడాపోటీలకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులు

చెన్నూర్: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారుడిని ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ మండలంలో గంగారం గ్రామానికి చెందిన నిరుపేద వ్యవసాయ కుటుంబంలో జన్మించిన రాజేశ్ జైపూర్ గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఫుట్‌బాల్ క్రీడల్లో రాణిస్తున్న రాజేశ్‌ను జడ్చర్ల స్పోర్ట్స్ అకాడమిలో ఫుట్‌బాల్‌లో ప్రత్యేక శిక్షణ పొందాడు. గతంలో మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రాజేశ్ ప్రతిభ కనబర్చి జట్టు గెలుపునకు కృషి చేశాడు. ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్ -17 ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి రాజేశ్ ఒక్కడే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2వరకు అండమాన్ నికోబార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాజేశ్ పాల్గొనాల్సి ఉంది. అయితే పోటీల్లో పాల్గొనేందుకు రూ.30వేల వరకు రవాణా ఖర్చులు కావాల్సి ఉంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడంతో దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నాడు.



జాతీయ పోటీలకు ఎంపికైన జనగామ రాజేశ్

జిల్లాకు పేరు తెస్తా..

ఎస్‌జీఎఫ్ అండర్ -17 జాతీయ క్రీడాపోటీల్లో రాణించే సత్తా ఉంది. జాతీయ స్థాయికి ఎంపికైన తెలంగాణ జట్టు బలంగా ఉంది. ఆర్థిక సహాయం అందిస్తే క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తున్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులే వెంటాడుతున్నాయి. క్రీడాకారులను ప్రభుత్వం అన్నీ విధాలుగా ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాయ స్థాయి క్రీడా పోటీలలో తెలంగాణ కీర్తి పతకాన్ని ఎగురవేస్తా.

–జనగామ రాజేశ్, ఫుట్‌బాల్ జాతీయ క్రీడాకారుడు

కోలిండియా ఒప్పందాలు అమలు చేస్తాం

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: కోలిండియాలో జరిగిన ఒప్పందాలను సింగరేణిలో అమలు చేస్తామని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. సోమవారం శ్రీరాంపూర్‌లోని ఎస్సార్పీ 3, 3ఏ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటికి అనేక ఒప్పందాలు సింగరేణిలో అమలు చేయలేదని, దీనికి గత గుర్తింపు సంఘాలు వైఫల్యమే కారణమన్నారు. తాము గెలిస్తే వాటన్నింటిని అమలు చేయిస్తామన్నారు. కార్పొరేట్ మెడికల్ బోర్డును ప్రక్షాళన చేసి 1981 కంపెనీ ఉత్తర్వుల ప్రకారం వారసత్వ ఉద్యోగాలను కొనసాగిస్తామన్నారు. కొత్తగూడెం, భూపాలపల్లి, రామగుండం, బెల్లంపల్లి ఏరియాలోని కంపెనీ ఆసుపత్రిలో ఎమ్మారై సదుపాయం కల్పిస్తామన్నారు. స్వచ్ఛమైన తాగునీటి సరఫరా చేస్తామన్నారు. సింగరేణిలో ఎన్నికలు జరగకుండా కాంగ్రెస్, ఐఎన్టీయూసీ కలసి కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి, నాయకులు బొంపల్లి రమేష్, కాంపల్లి తిరుపతి, పాకిడి శ్రీకాంత్, భీమయ్య, మంచాల రమేష్, కాల్వ రాజు వంశీకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

ఏఐటీయూసీ గెలిస్తేనే సింగరేణికి మనుగడ

- ఏఐటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జి వీకే బోస్

శ్రీరాంపూర్: ఎన్నికల్లో గెలిస్తేనే సింగరేణి మునగడ సాధిస్తుందని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి వి.కె బోస్ తెలిపారు. సోమవారం ఆయన ఆర్కే 5 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరగడంతో సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఆర్థిక దుబారా పెరిగిందని, సంస్థ నిధులు దారిమల్లాయన్నారు. నేడు కార్మికుల హక్కులను రక్షించే నాథుడు కరువయ్యారన్నారు. ఏఐటీయూసీ గెలిస్తేనే ఇవన్నీ రక్షించబడతాయని తెలిపారు. గెలిచిన తర్వాత కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.20 లక్షల వడ్డీలేని రుణం ఇప్పించడం జరుగుతుందన్నారు. భూగర్భ గనుల తీసుకువచ్చి కొత్త ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి సహాయ కార్యదర్శి ఎం. కొమురయ్య, నాయకులు చంద్రమోహన్, ప్రసాద్ రెడ్డి, వేణు, గండి సతీష్ ఉన్నారు.



మాట్లాడుతున్న వీకే బోస్

సింగరేణిలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి

జైపూర్: సింగరేణిలోని పవర్‌ప్లాంట్‌తో పాటు ఓసీ, గనుల్లో ఇతర డిపార్ట్‌మెంట్‌లలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలను స్థానికులకే కేటాయించే విధంగా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డికి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి వినతిపత్రం అందించారు. సోమవారం హైదరాబాద్‌లోని సీఎం చాంబర్‌లో సీఎంను కలిసి వివేక్ మాట్లాడారు. గతంలో పెద్దపల్లి ఎంపీగా ఉన్నప్పుడు స్థానికులకే ఉద్యోగావకాశం కల్పించాలని జీవోను తీసుకొచ్చినా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదని వివరించారు.



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వివేక్

కార్మిక హక్కులు కాపాడేది ఏఐటీయూసీ మాత్రమే



మాట్లాడుతున్న మిర్యాల రంగయ్య

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థతో పాటు కార్మికులను, హక్కులను కాపాడేది ఏఐటీయూసీ మాత్రమేనని ఏఐటీయూసీ అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య అన్నారు. సోమవారం ఏరియాలోని కేకే- 5గనిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ పది శాతం చెల్లించడం లేదని మండిపడ్డారు. యాజమాన్యం మెడలు వంచి కార్మికుల హక్కుల సాధన ఏఐటీయూసీతో మాత్రమే అవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు శ్రీనివాస్, సాంబయ్య, ప్రేమ్‌లాల్ తదితరులు ఉన్నారు.

ప్రాణత్యాగాలతో హక్కులు సాధించాం



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కాసిపేట: పలువురి ప్రాణ త్యాగాల ద్వారా కార్మికుల హక్కులు సాధించిన 100 సంవత్సరాల చరిత్ర ఏఐటీయూసీదని ఏఐటీయూసీ అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య అన్నారు. సోమవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎందరో అమరులు చేసిన పోరాటాల ద్వారా అనేక హక్కులు సాధించి నేడు కార్మికులకు అండగా ఉండటం జరిగిందన్నారు. కార్మికులు అనుభవిస్తున్న ప్రతి హక్కు వెనుకాల ఏఐటీయూసీ నాయకుల త్యాగం ఉందని, నిత్యం పోరాడే సంఘం ఏఐటీయూసీ మాత్రమే అన్నారు. కార్మికులు గుర్తించి అధిక మెజార్టీతో ఏఐటీయూసీని గెలిపించుకోవాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఎన్నికల మెనిఫెస్టోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, గని ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వరల్డ్ రికార్డ్‌లో మందమర్రి వాసి

మందమర్రిరూరల్: మ్యాజిక్ విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన మందమర్రి యువకుడు వడ్డెపల్లి సాయికృష్ణ వరల్డ్ రికార్డు సాధించాడు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని భారతీయ విద్యాభవన్‌లో మయూరి ఆర్ట్స్ సంస్థ సాయికృష్ణను ఘనంగా సన్మానించి పురస్కారాలతో పాటు ప్రశంసాపత్రాలు అందించింది. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాధ, నరేందర్, రమణ తదితరులు ఉన్నారు.



సాయికృష్ణను ప్రశంసిస్తున్న సంస్థ సభ్యులు

ప్రైవేటీకరణను తరిమికొడుతాం

- జీఎల్‌బీకేఎస్ అధ్యక్షుడు చాంద్‌పాషా

శ్రీరాంపూర్: సింగరేణిలో ప్రైవేటీకరణను తరిమికొడుతామని జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చాంద్‌పాషా తెలిపారు. సోమవారం శ్రీరాంపూర్ ఓసీపీపై విప్లవ కార్మిక సంఘాల కూటమీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఈ ఎన్నికల్లో కూటమి గుర్తు అయినచక్రంలో సిద్ధ గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. సింగరేణిలో కార్మికులకు ఇప్పటికీ గుర్తింపు సంఘం న్యాయం చేయలేదన్నారు. కమిషన్ల కోసం ఓపెన్ కాస్ట్ తవ్వుతున్నారని ఆరోపించారు. భూగర్భగనులు లేక ఉద్యోగ అవకాశాలు తగ్గుముఖం పట్టాయన్నారు. గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌తో పాటు జాతీయ సంఘాలు కూడా సింగరేణిలో వైఫల్యం చెందాయన్నారు. కార్మిక పక్షానా పోరాడే విప్లవ కార్మిక సంఘాల కూటమిని ఈ ఎన్నికల్లో గెలిపించాలన్నారు. కూటమి నాయకులు డి.బ్రహ్మానందం, మేకల రామన్న, పోచమల్లు, ఎండీ జాఫర్, తాళ్లపల్లి శ్రీనివాస్, వీ మల్లన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాంద్‌పాషా

ప్రైవేటీకరణతో కార్మికుల కుదింపు

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

శ్రీరాంపూర్: సింగరేణిలో ప్రైవేటీకరణ విపరీతంగా పెరగడంతో కార్మికుల సంఖ్య కుదింపైందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ తెలిపారు. సోమవారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులతో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో లక్ష ఇరవై వేల మంది ఉన్న కార్మికులు నేడు 40 వేలకు తగ్గారన్నారు. వారి స్థానంలో 22,000 మంది కాంటాక్ట్ కార్మికులు చేరారన్నారు. దీనంతటికి కారణం ఇప్పటివరకు గెలిచిన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్ కార్మిక సంఘాలే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నుండి సింగరేణికి రావాల్సిన రూ.28వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీలేవి అమలు కాలేదని పేర్కొన్నారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.ప్రకాష్, బ్రాంచ్ అధ్యక్షుడు జి.బాలాజీ, కోశాధికారి చంద్రశేఖర్, ఫిట్ సెక్రెటరీ శ్రీధర్, శ్రీనివాస అజయ్ ప్రవీణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూపాల్

వివాహిత ఆత్మహత్య



పుష్పాంజలి(ఫైల్)

జైపూర్: మండలంలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన వివాహిత పుష్పాంజలి(27) కుటుంబ కలహాల కారణంగా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన లక్కాకుల మల్లయ్య-దుర్గమ్మ దంపతుల కూతురు పుష్పాంజలికి నస్పూర్ మండలం సింగపూర్ గ్రామానికి చెందిన అగ్గు సాగర్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. నాలుగు నెలల క్రితం బాబు పుట్టాడు. ఆదివారం ఓ శుభకార్యం వెళ్లాల్సివుండగా భార్యభర్తలకు గొడవ జరిగింది. దీంతో పుష్పాంజలి పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. భర్త సాగర్ పుట్టింటికి సైతం వెళ్లి గొడవ చేశాడు. మనస్తాపం చెందిన పుష్పాంజలి సోమవారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరేసుకుంది. దీంతో ముగ్గురు పిల్లలు తల్లిలేనివారయ్యారు. రాత్రివరకు ఫిర్యాదు అందకపోవంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు.

పాదయాత్ర జయప్రదం చేయండి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 20వ తేదీ బుధవారం మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి నస్పూర్‌లోని ఐడీఓసీ కార్యాలయం వరకు చేపట్టనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం హాజీపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. బీసీ ఐక్యవేదిక సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న పాదయాత్రలో అన్ని బీసీ కులాలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీసీ సమాజానికి బీసీ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి బీసీల చిరకాల ఆకాంక్షను నెరవేర్చాలన్నారు. న్యాయమైన డిమాండ్‌ను నెరవేర్చడంలో బీజేపీ పార్టీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ఇకనైనా బీసీ బిల్లు ప్రవేశపెట్టి బీజేపీ బీసీల పక్షాన నిలవాలని కోరారు. బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఉన్నారు.